సాక్షి అనంతపురం

బుధవారం । 8 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.23,100

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,100 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9 పలికింది. కనిష్టం రూ.5. సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.1°/12.3°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థాయీ సంఘం-1, 2, 4, 7 (ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం / ఇంజినీరింగ్ శాఖ) సమావేశాలు జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రధాన మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. స్థాయీ సంఘం -3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖ) సమావేశాలు అదనపు భవన్‌లో ఆయా సంఘ అధ్యక్షుల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర వివరాలతో సమావేశాలకు హాజరుకావాలని స్పష్టం చేశారు.

నేడు జిల్లాకు కేంద్ర బృందం

అనంతపురం అగ్రికల్చర్: కరువు పరిస్థితులు తెలుసుకునేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన ముగ్గురు సభ్యుల ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం బుధవారం జిల్లాలో పర్యటించనుంది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనంతపురం రూరల్ మండలం మన్నీలతో పాటు రాప్తాడులో పంట పొలాల సందర్శన, రైతులతో ముఖాముఖి మాట్లాడనున్నారు. కరువు జాబితాలో ప్రకటించిన 7 మండలాల్లో రూ.19 కోట్ల నష్టం జరిగినట్లు ఇప్పటికే పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) నివేదికను జిల్లా అధికారులు సిద్ధం చేశారు. పశుశాఖ, ఉద్యానశాఖ, డ్వామా తదితర శాఖల పరిధిలో కూడా జిల్లాకు కేంద్రం నుంచి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నివేదించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర బృందం పర్యటన నేపథ్యంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ మంగళవారం తన చాంబర్‌లో ఏడీఏ ఎం.రవి, ఏఓలు బాలానాయక్, శశికళ తదితరులతో సమావేశం నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

హోరాహోరీగా ఇన్‌స్పైర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ



ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

అనంతపురం: అనంతపురం స్పోర్ట్స్ విలేజ్‌లో లాలిగా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. దేశ వ్యాప్తంగా మొత్తం 12 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటుండగా.. 216 మంది మహిళా క్రీడాకారిణులు హాజరయ్యారు. నర్మద వ్యాలీ (మధ్యప్రదేశ్), థామ్ (తమిళనాడు), లైఫ్ స్పోర్ట్స్ (తమిళనాడు), నంది ఫౌండేషన్ (గుజరాత్), అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ (ఆంధ్రప్రదేశ్), స్పోర్ట్స్, ఫుట్‌బాల్ అకాడమీ (తమిళనాడు), ఫాల్కన్ గర్ల్స్ (ఒడిశా), లిబర్టీ లేడీస్ (తమిళనాడు), బెంగళూరు (కర్ణాటక) జట్ల మధ్య మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి.

సహకార సంఘాలను మరింత బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

బెళుగుప్ప: సహకార వ్యవసాయ పరపతి సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రైతులను కలుపుకుని ముందుకు సాగాలని ఉభయ తెలుగు రాష్ట్రాల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఓఎం) కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ అన్నారు. బెళుగుప్పలోని పీఏసీఎస్‌లో ఏడీసీసీ హెచ్ఓ ఆర్వీ కృష్ణారెడ్డి, ఏజీఎం లక్ష్మీప్రసన్న, ఏఎం హరిణి, సీఈఓ పాండురంగతో కలసి సహకార సంఘాల నిర్వహణపై రైతులకు ఆయన అవగాహన కల్పించారు. సంఘం బలోపేతానికి చేపట్టాల్సిన అంశాలపై రైతుల నుంచి సలహాలు సూచనలు స్వీకరించారు.

నాడు ప్రగతి.. నేడు అధోగతి



- 2022-23లో 'జీవీఏ'లో జిల్లా దూకుడు
- తాజాగా అందుబాటులోకి గణాంకాలు
- వ్యవసాయ ఉత్పత్తుల్లో రూ.24 వేల కోట్ల పైగా వృద్ధి
- కూటమి ప్రభుత్వం వచ్చాక దారుణంగా పరిస్థితులు!

వ్యవసాయ రంగం కాంతులీనింది. పరిశ్రమల రంగం పరుగులు పెట్టింది. ఒకటేమిటీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని రంగాలు రయ్యిరయ్యిమంటూ దూసుకెళ్లాయి. కానీ, ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. వెలుగులు కనుమరుగైపోయాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తే ఒక్కసారిగా చీకట్లు కమ్ముకున్నట్లుగా ఎవరికైనా అర్థమైపోతుంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో జిల్లా పురోగతి సాధించింది. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ వనరులు సమకూరాయి. తాజాగా అందుబాటులోకి వచ్చిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. 2022-23 స్థూల ఉత్పత్తి విలువ(గ్రాస్ వ్యాల్యూ యాడెడ్-జీవీఏ)పై గణాంకాలను ప్రభుత్వం వెల్లడించింది. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో వివిధ రంగాల్లో జిల్లా పురోగతిపై చర్చించారు. 'రైస్ బౌల్ ఆఫ్ ఆంధ్ర'గా చెప్పుకునే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల కంటే కూడా అనంతపురం జిల్లా ముందంజలో ఉన్నట్లు తేలింది.

వ్యవసాయ రంగంలో గణనీయ వృద్ధి..

ముఖ్యంగా గడిచిన ఐదేళ్ల ప్రభుత్వ కాలంలో జిల్లాలో వ్యవసాయ రంగం భారీగా పురోభివృద్ధి సాధించింది. నదీ పరివాహక ప్రాంతాలైన గుంటూరు, తూర్పు గోదావరి జిల్లాలతో పోల్చినా అనంతపురమే ముందంజలో నిలిచింది. రకరకాల పండ్లతోటలు, ఎగుమతులతో గణనీయంగా ఆదాయం చేకూరింది. ఇక్కడి ఫలాలు వివిధ రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి అయ్యాయి. పుష్కలంగా వర్షాలు పడటం, రైతుకు సమయానికి 'వైఎస్సార్ రైతు భరోసా' కింద సాయం అందడం వంటి వాటితో వ్యవసాయ రంగం రూ.24 వేల కోట్ల మార్కు దాటింది. స్థూల ఉత్పత్తి విలువలో 3వ ర్యాంకు సాధించింది.

పరిశ్రమల రంగంలోనూ..

గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు, సర్వీసు రంగాల్లోనూ భారీ పురోగతి కనిపించింది. ఎంఎస్ఎంఈల స్థాపన, సర్వీసు రంగం (వాహన సేవలు) వంటివాటితో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి కల్పన సాకారమైంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పరిశ్రమల రంగంలో రూ.13 వేల కోట్ల విలువను సూచించింది. సేవల రంగంలో సైతం రూ.939 కోట్లతో రాష్ట్రంలోనే జిల్లా 7వ స్థానంలో నిలిచింది. అన్ని రంగాల్లో కలిపితే రూ.59 వేల కోట్ల పైచిలుకు ఉత్పత్తితో 26 జిల్లాల్లో 6వ స్థానం సంపాదించుకుంది.



నాడు: అనంతపురం మార్కెట్ యార్డులో చీనీ క్రయవిక్రయాలు



నేడు: గిట్టుబాటు ధరలేక ఆత్మకూరు వద్ద రోడ్డు పక్కన రైతులు పారబోసిన టమాట

నాటి కళ ఏదీ..?

కూటమి సర్కారు పాలనా పగ్గాలు చేపట్టి ఏడు మాసాలు కావస్తోంది. ఈ కొద్ది కాలంలోనే పరిస్థితులు దారుణంగా మారాయి. కొత్త పరిశ్రమలు రాక పారిశ్రామిక రంగం కుదేలైంది. రైతుకు భరోసా లేకుండా పోయింది. పంట పండినా గిట్టుబాటు కాకపోవడం వంటి కారణాలతో అన్నదాతకు నష్టాలే మిగులుతున్నాయి. ఇక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉద్యోగ, ఉపాధి కల్పన అటకెక్కింది. జిల్లాలో ఎక్కడ చూసినా 'పచ్చ' నేతల దౌర్జన్యాలు, బెదిరింపుల ప్రభావం ఆయా రంగాలపై తీవ్రంగా పడుతోందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వివిధ రంగాల్లో ఇలా

వ్యవసాయ, అనుబంధ రంగం	
మొత్తం జీవీఏ	రూ.24,858 కోట్లు
రాష్ట్ర వాటాలో	5.81 శాతం
ర్యాంకు	03
పరిశ్రమల రంగం	
మొత్తం జీవీఏ	రూ.13,065 కోట్లు
రాష్ట్ర వాటాలో	4.11 శాతం
ర్యాంకు	08
సేవల రంగం	
జీవీఏ	రూ.939 కోట్లు
రాష్ట్ర వాటాలో	4.56 శాతం
ర్యాంకు	07
మొత్తం స్థూల ఉత్పత్తి విలువ	
జీవీఏ	రూ.59,862 కోట్లు
రాష్ట్ర వాటాలో	4.89 శాతం
ర్యాంకు	06

అన్ని రంగాల్లో మెరుగ్గా

జీవీఏ పరంగా జిల్లా మూడో స్థానంలో నిలిచింది. వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. అదే వృద్ధిని కొనసాగించేలా పనిచేస్తాం. అన్ని రంగాల్లోనూ పురోగతి కనిపించేలా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్

జీజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు



హెచ్ఓడీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ఎట్టకేలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులు మేలుకున్నారు. బెంగళూరులో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు నమోదు కావడంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మానసిక వైద్య విభాగం వార్డులో మంగళవారం 20 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. వ్యాధి లక్షణాలున్న వారిని అడ్మిట్ చేయాలని సంబంధిత వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు ఆదేశించారు. మెడిసిన్, పల్మనరీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, పీడియాట్రిక్ హెచ్ఓడీలతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. కేసులు నమోదైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. కమిటీకి నోడల్ ఆఫీసర్‌గా పల్మనాలజీ హెచ్ఓడీ డాక్టర్ రామస్వామి, సభ్యులుగా మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ భీమసేనాచార్, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు, పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ రవికుమార్‌తో పాటు మైక్రో బయాలజీ హెచ్ఓడీ ఉన్నారు. మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాలలోని ఆర్‌టీపీసీఆర్‌లో వైరస్ నిర్ధారణ పరీక్షలు జరగనున్నాయి. దీంతో పాటు ఎన్-95 మాస్కులు, శానిటైజర్లు అందుబాటులో ఉంచారు.

ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం అర్బన్: ఎస్సీ కులగణనపై అభ్యంతరాల స్వీకరణ గడువు ఈనెల 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. 12 తేదీ వరకు నిర్దేశిత ప్రాంతాల్లో ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ వరకు నమోదు చేస్తారన్నారు. అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను ఈనెల 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కోర్టు కేసులు తేలిగ్గా తీసుకోవద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కోర్టు కేసులు తేలిగ్గా తీసుకోకుండా జవాబుదారీతనంతో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో నోడల్ అధికారులను నియమించామని, సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరగనప్పుడే కోర్టును ఆశ్రయిస్తారన్నారు. సమస్యలకు కచ్చితమైన పరిష్కారం చూపినప్పుడే యంత్రాంగంపై నమ్మకం కలుగుతుందన్నారు. కేసుల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ రూల్ పొజిషన్ ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. కోర్టు కేసుల్లో ఎవరు ధిక్కరణలో ఉంటారో వారి వివరాలు తెలపాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, మెజిస్టీరియల్ విభాగం సూపరింటెండెంట్ వసంతలత, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నాణ్యత లేదు

సమస్యలపై ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంలో వెనుకబడి ఉన్నారంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యుటేషన్లు, కరెక్షన్లు, ఎఫ్‌లైన్ పిటీషన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, తదితర అంశాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించి ఉంటే వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పొజిషన్ సర్టిఫికెట్లలో లబ్ధిదారుని ఫొటోతో పాటు భూమి వివరాలు ఉండాలని ఆదేశించారు. ఈ పాసు పుస్తకాలు పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో డీఆర్ఓ మలోల

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రేణుమాకుపల్లిలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. 1910 నుంచి 1925 వరకు బ్రిటిష్ వారు భూముల సర్వే చేశారని, మళ్లీ వందేళ్ల అనంతరం ఇప్పుడు వాటిలో దోషాలను సరిద్దిదడానికి రీ సర్వే చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుంచి రీసర్వేకు సంబంధించి ఎలాంటి నోటీసు వచ్చినా రైతులు జాగ్రత్తగా ఉంచుకోవాలని, కొలతల్లో తేడాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫైనల్ చేసిన తరువాత భూమి ఎంత ఉంటే అంతేనని, అందులో ఏమీ మార్పు ఉండదని తెలిపారు. అనంతరం 10 మంది లబ్ధిదారులకు ఇంటి హక్కు పత్రాలను కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, బీసీ వెల్ఫేర్ డీడీ ఖుష్బూ కొఠారి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన సేవలందించాలి

అనంతపురం మెడికల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ వైద్యులను ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రం, జేఎన్‌టీయూ సమీపంలోని కేన్సర్ ఆస్పత్రి, పాతూరు సీడీ ఆస్పత్రి, రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాతూరు సీడీ ఆస్పత్రిలో రోగులకందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. రోజూ 300 నుంచి 400 మంది వైద్యం పొందుతుంటారని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ కలెక్టర్‌కు వివరించారు. శారదనగర్‌లో ఉన్న కేన్సర్ యూనిట్‌ను పరిశీలించి, రోగులు ఉత్తమ సేవలందించాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ, తదితరులు ఉన్నారు.

కాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టొద్దు

- ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: ప్రజారోగ్యానికి హాని కలిగించే కాల్షియం కార్బైడ్‌తో పండ్లను మాగబెట్టడం మంచిది కాదని ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు తెలిపారు. అరటి, మామిడిని మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ వాడినట్లు గుర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఆయన మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణ చౌదరి, ఉద్యానశాఖ హెచ్ఓ రత్నకుమార్‌తో కలిసి స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంగణంలో, సంగమేశ్వర సర్కిల్‌లో ప్రైవేట్ మండీ వ్యాపారులు నిర్వహిస్తున్న రైపనింగ్ చాంబర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 లక్షల ఎకరాల్లో ఉద్యాన తోటలు విస్తరించాయన్నారు. అరటి, మామిడి, బొప్పాయి, సీతాఫలం, పనస, సపోటా తోటల్లో పక్వానికి రాకమునుపే తొలగించి కాల్షియం కార్బైడ్‌తో మాగబెడుతుండటంతో అనర్థాలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ పద్ధతిని నిర్మూలించేందుకు ప్రభుత్వాలు రైపనింగ్ చాంబర్లను ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ముందుకు వస్తే యూనిట్‌కు అయ్యే ఖర్చులో 35 శాతం మేర రాయితీ వర్తింపజేస్తామని, గరిష్టంగా రూ.10 లక్షల వరకు యూనిట్ ఏర్పాటుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఒక టన్ను సామర్థ్యం కలిగిన రైపనింగ్ చాంబర్‌కు రూ.లక్ష ఖర్చవుతుండగా, 35 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. వివరాలకు 79950 86792లో సంప్రదించాలని సూచించారు.



మార్కెట్‌యార్డులో రైపనింగ్ చాంబర్‌ను పరిశీలిస్తున్న డీడీ హెచ్ నరసింహారావు

జెడ్పీటీసీలకు గౌరవ వేతనం మంజూరు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని 63 మంది జెడ్పీటీసీలు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం మంజూరైంది. 2024, మార్చి ఒకటి నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ సహా జెడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులకు గౌరవ వేతనం మంజూరు కాలేదు. ఈ అంశంపై సమావేశాల్లో పలుమార్లు సభ్యులు జిల్లా స్థాయి అధికారులను నిలదీశారు. ఈ నేపథ్యంలో గౌరవవేతనం చెల్లింపులకు రూ.50 లక్షలు అవసరమని జెడ్పీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపగా... రూ.34 లక్షలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మొత్తాన్ని ప్రజాప్రతినిధుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు.

మీతో వేగలేం బాబోయ్!

- అనంతపురం నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ సుదీర్ఘ సెలవు
- బాధ్యతలు తీసుకున్న 22 రోజుల్లోనే తిరుగుముఖం
- ఇప్పటికే సెలవులో రెగ్యులర్ కమిషనర్
- కూటమి నేతల ఆగడాలతో బెంబేలు
- ఐఏఎస్ అధికారి వస్తేనే మేలు

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నగరపాలక సంస్థలో పని చేయాలంటే అధికారులు వణికిపోతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గలేక సెలవుల బాట పడుతున్నారు. తాజాగా నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ ఈ నెల 7 నుంచి వచ్చే నెల 2 వరకు సెలవులో వెళ్లడం చర్చనీయాంశమైంది.



22 రోజుల్లోనే తిరుగుముఖం..

తాము చెప్పినట్టల్లా సీ బిల్లులు చేయాలని, అభివృద్ధి పనుల కాంట్రాక్టులను తమ వారికే అప్పగించాలంటూ ఒత్తిడి చేయడంతో ఈ నెల 15న కమిషనర్ నాగరాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. దీంతో ప్రభుత్వం మరుసటి రోజే అదనపు కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్‌కు కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, చార్జ్ తీసుకున్న 22 రోజుల్లోనే ఆయన కూడా సెలవు పెట్టడం గమనార్హం. పైగా తన సెల్‌ను సైతం నగరపాలక సంస్థలో అప్పగించి వెళ్లారంటే ఒత్తిళ్లు ఏ మేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇష్టారాజ్యంగా బిల్లులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక నగరపాలక సంస్థలో సీ బిల్లులకు రెక్కలు వచ్చాయి. ఓ ఏఈ కనుసన్నల్లో ఇప్పటికే రూ.80 లక్షల వరకు సీ బిల్లులు పెట్టినట్లు సమాచారం. వాస్తవంగా రూ.లక్ష దాటాక సీ బిల్లులు పెట్టరాదు. కానీ, నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీబిల్లులు పెడుతున్నారు. అందులో నగరపాలక సంస్థ ఇంజినీర్లు, అకౌంటెంట్ సిబ్బంది పరోక్షంగా టీడీపీ నాయకులకు సహకరిస్తున్నట్లు తెలిసింది. పర్సెంటేజీలు తీసుకుని ఓ ఏఈ, అకౌంట్ సెక్షన్ సిబ్బంది సీ బిల్లులు ఆమోదిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో పాటుగా బయోమైనింగ్ బిల్లులు చేయాలని నగరపాలక సంస్థ అధికారులపై టీడీపీ ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తెస్తున్నారు. దీంతో ఎటూపాలుపోని పరిస్థితిలో అధికారులు పక్కకు తప్పుకుంటున్నారు.

గతంలోనూ ఇంతే...

2014 నుంచి 2019 వరకూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలాంటి దుస్థితే ఉండేది. అప్పట్లో కమిషనర్లుగా పని చేసిన చల్లా ఓబులేసు, సురేంద్రబాబు, ఉమామహేశ్వర్ అర్ధంతరంగా సెలవులో వెళ్లిపోయారు. కొందరు కమిషనర్లు అధికార పార్టీ నేతలతో తిట్లు తిన్న సందర్భాలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో కూడా నాయకులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుండటంతో అధికారులు సెలవులో వెళ్లిపోతుండటం చర్చనీయాంశమైంది.

ఐఏఎస్ ఉంటేనే..



అనంతపురంలోని ఓ రోడ్డు దుస్థితి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నగర పాలన సాఫీగా సాగింది. ప్రభుత్వం అధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వడంతో ప్రగతి పరుగులు పెట్టింది. నగరంలో రూ.వందల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. అభివృద్ధి అటకెక్కింది. అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో పాలనాధికారిగా ఐఏఎస్ స్థాయి అధికారి ఉంటేనే పాలన గాడిలో పడుతుందని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ ఇంటర్వ్యూల సందర్భంగా పరీక్ష రాస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. తొలి రోజు రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మంగళవారం కల్పతరు ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ చేపట్టింది. అనంతపురం, ఉరవకొండ, తాడిపత్రి, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, కళ్యాణదుర్గం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొత్తం 92 మంది పాల్గొన్నారు. తొలుత రాత పరీక్షను నిర్వహించగా 64 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. తుది రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంది. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ధీరేంద్రబాబు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

గుత్తి: స్థానిక బీసీ కాలనీలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రాజేష్ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. మంగళవారం ఉదయం 9 గంటలకు రాజేష్ తన ఇంటికి తాళం వేసి పాఠశాల విధులకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ ఆగంతకుడు... తాళాలు తీసి లోపలకు ప్రవేశించాడు. బీరువాలోని 15 తులాల బంగారు నగలు, రూ.లక్ష నగదు అపహరించాడు. సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకున్న రాజేష్... చోరీ విషయం గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, స్థానికుల సమాచారం మేరకు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు పుష్పావతి

అనంతపురం: మద్యం మత్తులో కుటుంబ పోషణను నిర్లక్ష్యం చేసిన భర్త వైఖరితో మనస్తాపం చెంది ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌లో నివాసముంటున్న పుష్పావతి (32), రామాంజనేయులు దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెయింటింగ్ పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్న రామాంజనేయులు కొన్ని నెలలుగా మద్యానికి బానిసై, జులాయిగా మారాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణను పూర్తిగా విస్మరించాడు. తాగుడు మానేసి, కుటుంబ పోషణపై దృష్టి పెట్టాలని మంగళవారం ఉదయం భార్య హితవు పలికింది. ఇది రుచించని రామాంజనేయులు ఆమెతో ఘర్షణ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన పుష్పావతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరం.. జీవన సమరం

శ్రమజీవుల బతుకు పోరు ముందు చలి తలవంచింది. అనంతపురం నగరంలో అర్ధరాత్రి సమయాన పారిశుధ్య కార్మికులు రహదారులు శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. హమాలీలు, వ్యాపారులతో కాయగూరలు, ఆకుకూరల మార్కెట్‌లో సందడి నెలకొంది. రైల్వే ఫీడర్ రోడ్డులో సక్రమంగా పనిచేయని సీసీ కెమెరాలకు సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేపట్టారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకూ ఈ దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అర్ధరాత్రి 12 గంటల సమయంలో టవర్ క్లాక్ సెంటర్






చలిలోనే రోడ్డు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికురాలు, అర్ధరాత్రి సీసీ కెమెరాను మరమ్మతు చేస్తున్న దృశ్యం, తెల్లవారుజాము 4 గంటలకే పాతూరు మార్కెట్‌లో సందడి, రాత్రి టీ కొట్టు వద్ద ఇలా..

శిఖరాలే చిన్నబోయాయి

- ఎత్తైన పర్వతాలను అధిరోహించిన పేదింటి బిడ్డలు



పర్వతారోహణలో పాల్గొన్న గోపాల్



ఎన్‌సీసీ క్యాడెట్లతో గోపాల్, యోగీశ్వరి (ఫైల్)

రాయదుర్గం: కలలు కనడమే కాదు.. వాటిని సాకారం చేసుకున్నారు పేదింటి బిడ్డలు. ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించారు రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు.

ఎన్‌సీసీ ద్వారా అందివచ్చిన అవకాశం

రాయదుర్గంలోని కేటీఎస్ డిగ్రీ కళాశాలలో మైక్రోబయోలజీ ద్వితీయ ఏడాది చదువుతున్న యోగీశ్వరి, జి.గోపాల్ ఇద్దరూ పేదింటి నుంచి వచ్చారు. సాహస కృత్యాలు చేయడంతో పాటు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుంటూ వచ్చారు. తమ అభిరుచికి తగినట్లుగానే ఎన్‌సీసీ క్యాడెట్లుగా చేరి మరింత రాటుదేలారు. ఈ క్రమంలో ఇటీవల 15 రోజుల పాటు ఉత్తర కాశీలోని హిమాలయ పర్వతారోహణకు అర్హత సాధించారు. దేశవ్యాప్తంగా 17 ఎన్‌సీసీ కమాండెంట్లకు చెందిన క్యాడెట్లు హాజరు కాగా, ఏపీ తరఫున యోగీశ్వరి, గోపాల్ ఇద్దరే ఉండడం గమనార్హం. అన్నింటా వీరు ముందుంజలో ఉంటూ అగ్రస్థానంలో నిలిచి, కళాశాల ఖ్యాతిని చాటిచెప్పారు. ఈ నేపథ్యంలో తమ సాహస యాత్ర ముగించుకుని వచ్చిన విద్యార్థులను మేళతాళాల మధ్య కళాశాల గేటు నుంచి లోపలి వరకూ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రఘురామమూర్తి, అధ్యాపకులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాతీయ పర్వతారోహణకు తొలిసారిగా తమ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రెండో బ్యాచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నాన్న కల సాకారం చేయాలని



అనారోగ్యంతో మా నాన్న మరణించారు. శిఖరం ఎక్కేంత స్థాయికి నన్ను ఎదిగేలా చేస్తానని నాన్న అంటుండేవారు. ఆయన లేకపోయినా ఆయన కలను సాకారం చేయాలనే పట్టుదల నాలో పెరిగింది. దీంతో ఎన్‌సీసీలో చేరి తొలి ప్రయత్నంలోనే నాన్న కలను సాకారం చేయగలిగాను. జాతీయ స్థాయి పతకాన్ని సొంతం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

– ఎం.యోగీశ్వరి, విద్యార్థిని, రాయదుర్గం

అనుకున్నది సాధించా



మాది సాధారణ రైతు కుటుంబం. అమ్మ, నాన్న పూర్తిగా నిరక్షరాస్యులు. వారి కష్టం నాకు రాకూడదని నన్ను చదివిస్తున్నారు. కొండలు ఎక్కడమంటే నాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. ఎప్పటికైనా ఎత్తైన కొండలు ఎక్కకపోతానా అని అనుకునేవాడిని. ఇది సాధించాలంటే ఎన్‌సీసీ ఒక్కటే మార్గమనుకుని అందులో చేరారు. అనుకున్నట్లుగానే పర్వతారోహణకు ఎన్‌సీసీ కమాండెంట్లు ప్రతిపాదించిన పేర్లలో నన్నూ చేర్చారు. ఉత్తరకాశీలో పర్వతారోహణ కొత్త అనుభూతిని మిగిల్చింది. పతకం అందుకోవడం ఎంతో గర్వంగా ఉంది. –జి.గోపాల్, విద్యార్థి, పల్లేపల్లి

రైతులను విస్మరిస్తే పుట్టగతులుండవు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

అనంతపురం అర్బన్: ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా కేవలం ప్రజల కోసమే వ్యవసాయం చేస్తున్న రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తే పుట్టగతులుండవని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములుతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా వంద మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే కనీసం వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతుల కుటుంబాలను పరామర్శించి సొంత నిధులతో ఆర్థిక సాయం చేసిన పవన్‌కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆత్మహత్య చేసుకున్న రైతుల గురించి ప్రస్తావించకపోవడం చూస్తే... ఆయన వాస్తవ నైజం ఏమిటనేది బయటపడిందన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి సహాయక చర్యలతో పాటు పంట నష్టానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

గుత్తి రూరల్: భూ సమస్యలను గ్రామ పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని గ్రామీణులకు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సూచించారు. మండలంలోని ధర్మాపురం, మార్నేపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ధర్మాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు జేసీ, మార్నేపల్లిలో జరిగిన సదస్సుకు ఎంపీపీ విశాలాక్షి హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ... గ్రామాల్లో ఇరువురి మధ్య నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి తమ పరిధిలో చాలా సమయం పడుతుందన్నారు. దీంతో గ్రామాల్లో రైతులు పెద్ద మనుషుల సమక్షంలో కూర్చొని పరస్పరం మాట్లాడుకొని సమస్యను పరిష్కరించుకోవడం ఉత్తమమన్నారు. చిన్నపాటి విషయాలకు గొడవలు పడుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కాలం వృథా చేసుకోవద్దన్నారు. అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, డీటీ శ్రీలత, వీఆర్‌ఓలు సురేంద్ర, వెంకట్రాముడు పాల్గొన్నారు.

ఇద్దరు బాలుర అదృశ్యం



రాహుల్

గుంతకల్లు టౌన్: స్థానిక మోదినాబాద్‌కు చెందిన విద్యార్థులు బి.రాహుల్, పరుశురాముడు కనిపించడం లేదు. సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రాహుల్ స్కూల్‌కి సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లి ఉరుకుందమ్మ మందలించింది. దీంతో సోమవారం మధ్యాహ్నం అదే వీధికి చెందిన తన స్నేహితుడు పరుశురాముడితో కలసి స్కూల్‌కి వెళుతున్నట్లు చెప్పి బయల్దేరాడు. సాయంత్రమైన ఇద్దరూ ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం ఉదయం రాహుల్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు వన్‌టౌన్ పీఎస్ సీఐ మనోహర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96821కు సమాచారమందించాలని కోరారు.

రిమాండ్‌కు ఇద్దరు

ఉరవకొండ: వ్యక్తిపై హత్యాయత్నం చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహానంది తెలిపారు. వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన ఎగ్గడి నారాయణస్వామిపై గత ఏడాది డిసెంబర్ 31న రాత్రి అదే గ్రామానికి చెందిన మీనుగ వంశీ, మీనుగ ఓబన్న పాత కక్షల నేపథ్యంలో గొడ్డలితో దాడి చేశారు. క్షతగాత్రుడి భార్య సుంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం వంశీ, ఓబన్నను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అధిక దిగుబడినిచ్చే వంగడాలను సృష్టించాలి



వ్యవసాయ విద్యార్థులతో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు

శింగనమల: రైతులకు ఉపయోగపడేలా అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలను సృష్టించే శాస్త్రవేత్తలుగా ఎదగాలని వ్యవసాయ కళాశాల విద్యార్థులకు రెడ్డిపల్లి కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం శింగనమల మండలం నాయనవారిపల్లిలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌బీవీఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడారు. రైతులతో కలసి పంటల సాగు విధానాలు అధ్యయనం చేయడంతో పాటు నూతన సాగు విధానాలు, వంగడాలపై రైతులను చైతన్య పరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన వ్యవసాయ ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించారు. రెడ్డిపల్లి ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్.భార్గవి, ఏఆర్ఎస్ రేకులకుంట శాస్త్రవేత్త జి.నారాయణస్వామి, తహసీల్దార్ బ్రహ్మయ్య, గుత్తి ఏడీఏ వెంకటరాముడు, మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, సబిత, మాధవి, రైతులు పాల్గొన్నారు.

బాబూ.. హామీలు ఏమయ్యాయి?

- ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలో వక్తలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

రాయదుర్గం టౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఏమి చేశారో చెప్పాలంటూ సీఎం చంద్రబాబును ఏఐవైఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రశ్నించారు. మంగళవారం రాయదుర్గంలో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 20వ జిల్లా మహాసభ ఘనంగా జరిగింది. తొలుత పట్టణంలో కళాశాల విద్యార్థులతో కలసి ఏఐవైఎఫ్, సీపీఐ జిల్లా, రాష్ట్ర నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో మహాసభ నిర్వహించారు. ఈశ్వరయ్య, జాఫర్‌తోపాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర, లెనిన్ బాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌బాబు, సంతోష్‌కుమార్, సీపీఐ సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, రాయదుర్గం కార్యదర్శి నాగార్జున, ఏఐవైఎఫ్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్ తదితరులు మాట్లాడారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనను భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులుగా గుర్తించినా ప్రస్తుత పాలకులు విద్యను వ్యాపారంగా మార్చేశారన్నారు. వైద్యం అందరికీ అందడం లేదని, విద్యావంతులైన వారికి ఉపాధి అవకాశాలు దొరకడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చకపోతే సంక్రాంతిలో కూటమి మేనిఫెస్టోను తగలబెడుతామని హెచ్చరించారు.

'ఎస్వీ' విద్యార్థి ఘనత



విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న కె.యశ్వంత్‌రెడ్డి అరుదైన ఘనత సాధించాడు. వినూత్న ఆలోచనలతో తాను రూపొందించిన 'ధన్విన్ ఎకో వుడ్స్ స్టార్టప్'కు అమెరికాకు చెందిన బ్లూప్లాట్ వెంచర్స్ ఎల్‌ఎల్‌సీ సంస్థ దన్నుగా నిలిచింది. రూ. 45 లక్షలు పెట్టుబడి ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. వివరాలను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి వెల్లడించారు. విద్యార్థి యశ్వంత్‌రెడ్డిని అభినందించారు. 2023లో ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్టార్టప్ జాతర'లో పాల్గొన్న యశ్వంత్‌రెడ్డి రూపొందించిన ప్రాజెక్ట్ 'బెస్ట్ స్టార్టప్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచిందన్నారు. స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీం ద్వారా రూ. 5 లక్షలు పెట్టుబడి పొందాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఏవీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్‌భట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కదిరిలో నకిలీనోట్ల కలకలం

- పొట్టేళ్లు కొని నకిలీ నోట్లిచ్చిన కేటుగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు



నకిలీనోట్లు



రైతు నగేష్

కదిరి అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో కొందరు కేటుగాళ్లు రైతు నుంచి పొట్టేళ్లు కొనుగోలు చేసి నకిలీ కరెన్సీ నోట్లు అంటగట్టారు. అవి నకిలీ నోట్లని ఆలస్యంగా తెలుసుకున్న రైతు.. కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ముదిగుబ్బ మండలానికి చెందిన రైతు నగేష్ తన పొట్టేళ్లు అమ్ముకునేందుకు మంగళవారం కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చారు. ఇద్దరు యువకులు బేరమాడి నగేష్ వద్ద ఉన్న ఒక్కో పొట్టేలు రూ.16,250 చొప్పున రెండూ కలిపి రూ.32,500 కొనుగోలు చేశారు. అనంతరం ఆయనకు డబ్బులిచ్చి పొట్టేళ్లు తీసుకువెళ్లారు. అనంతరం రైతు నగేష్ కదిరిలోని తన బంధువు వద్దకు వెళ్లి డబ్బు అతనికి ఇచ్చాడు. అయితే అవి నకిలీ నోట్లని గుర్తించిన అతను అదే విషయాన్ని రైతు నగేష్‌కు చెప్పాడు. దీంతో మోసపోయానని గ్రహించి నగేష్ వెంటనే కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు మార్కెట్‌యార్డ్‌లోని సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా.. దుండగులు మాస్కులు ధరించి కనిపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిపై ఏసీబీ విచారణ చేపట్టాలి

- అధికారుల వైఖరిపై టీడీపీ కౌన్సిలర్ పవన్‌కుమార్‌గౌడ్ మండిపాటు
- బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించిన నలుగురు టీడీపీ కౌన్సిలర్లు



అధికారుల తీరును ఎండగడుతున్న కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్

గుంతకల్లు టౌన్: 'మున్సిపల్ కార్యాలయంలో అవినీతి విచ్చలవిడిగా జరుగుతోంది. దీనిపై ఏసీబీ విచారణ చేపట్టాలి. ఈ మేరకు కలెక్టర్‌ను కోరబోతున్నా' అంటూ టీడీపీ కౌన్సిలర్ పవన్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తున్న పన్నులను పట్టణాభివృద్ధికి వెచ్చించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ తాను బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, బయటకు వెళ్లిపోయారు. మంగళవారం గుంతకల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగిన మున్సిపల్ (బడ్జెట్) ప్రత్యేక సమావేశం ఇందుకు వేదికైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.96.52 కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌ను అకౌంట్స్ అధికారులు ప్రవేశపెట్టగా, కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకు ముందు పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. కౌన్సిల్ మీట్‌కు రావడం, అజెండాల్లోని అంశాలను ఆమోదించడం పరిపాటిగా మారిందే తప్ప వార్డుల్లో కనీస వసతులను కల్పించలేకపోతున్నందుకు చాలా బాధగా ఉందన్నారు. అధికారుల అవినీతి, పక్షపాత వైఖరిని నిరసిస్తూ తాను బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు పేర్కొనడంతో మరో ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లు సుధాకర్, విజయ్, రవి కూడా సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. కాగా, ఫ్రీ ఆడిట్ అధికారులు అన్నింటికీ కొర్రీలు వేస్తున్నారంటూ పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఈ వైఖరి వీడాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి హితవు పలికారు.

సీనియర్ జర్నలిస్ట్ జెమినీ ప్రసాద్ దేహదానం



జెమినీ ప్రసాద్ భౌతికకాయాన్ని స్వీకరిస్తున్న వైద్యకళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: ఆరు దశాబ్దాల పాటు కలం పోరాటంతో ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ జర్నలిస్ట్ నందినేని దేవప్రసాద్ అలియాస్ జెమినీ ప్రసాద్ మృతి అనంతరం ఆయన భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ నెల 6న ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్ నుంచి భారీ ర్యాలీగా బోధనాస్పత్రికి ఆయన భౌతిక కాయాన్ని జర్నలిస్టులు తరలించి ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు అప్పగించారు. కళాశాలలోని అనాటమీ డిపార్ట్‌మెంట్‌లో ఆయన శరీరాన్ని భద్రపరిచారు. అన్ని దానాల్లోకెల్లా దేహదానం చాలా గొప్పదని, ఎంతో మంచి మనసు ఉంటే తప్ప అంత గొప్ప పని చేయడం సాధ్యం కాదని ఈ సందర్భంగా డాక్టర్ మాణిక్యరావు కొనియాడారు. మానవ అంతర్ నిర్మాణ శాస్త్ర అధ్యయనానికి దేహదానం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అనాటమీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, చల్లా నాయుడు, తలారి రామాంజినేయులు, నాగభూషణం, విశ్వనాథ్, సుధాకర్, చంద్ర, రామాంజినేయులు, శ్రీరాములు, నాగభూషణం, బోగేశ్వరరెడ్డి, నందుటైమ్స్ భాస్కరరెడ్డి, రామలింగారెడ్డి, మంజునాథ్, శ్రీనివాసరెడ్డి, 150 మందికిపైగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కటారుపల్లిలో వేమన జయంతి ఉత్సవాలు ప్రారంభం



ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండలంలోని కటారుపల్లిలో వెలసిన యోగి వేమన ఆలయంలో జయంతి ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వేమన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఆలయ పీఠాధిపతుల ఆధ్వర్యంలో స్వామి గొడుగుకు ప్రత్యేక పూజలు చేసి ప్రాకారోత్సవం, సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ పొర్లు దండాలతో మొక్కులు తీర్చుకున్నారు.

అధునాతన వైద్యం.. 'అనంత' సొంతం

• అందుబాటులో బైపాస్, న్యూరో సర్జరీలు



అనంతపురం మెడికల్: అనంతపురంలో వైద్య సేవల విస్తృతిలో పెద్ద మార్పు వచ్చింది. ఒకప్పుడు చిన్నపాటి ప్రమాదం జరిగితే పక్కన ఉన్న కర్నూలు, బెంగళూరుకు పరుగులు తీయాల్సి వచ్చేది. అటువంటిది ఐదేళ్లలో అనంతపురం రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీతో పాటు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్రంలోనే ఉండడం గమనార్హం. గుండె సమస్యలకు సంబంధించి బైపాస్ సర్జరీ, ఇతర శస్త్రచికిత్సలు, న్యూరో సర్జరీలు, కేన్సర్, ప్లాస్టిక్ సర్జరీ, తదితర వాటికి కేంద్రంగా అనంతపురం నిలుస్తోంది. కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులు అందుబాటులో ఉండడంతో రోగులు బెంగళూరు, హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్యం పొందుతున్నారు. వీటితో పాటు స్కాన్ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు అందుబాటులో ఉన్నాయి. రోగ నిర్ధారణకు సంబంధించి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో మొత్తం క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు, డయాగ్నస్టిక్ సెంటర్లు 374 ఉన్నాయి. వాటిలో జిల్లా కేంద్రంలోనే 60 శాతం ఉండడం గమనార్హం. జిల్లాలో 20 పడకల నర్సింగ్ హోంలు 80, అలాగే 50 పడకల నర్సింగ్ హోంలు 50, వంద పడకల నర్సింగ్ హోంలు 21 ఉన్నాయి. చిన్న డయాగ్నస్టిక్ సెంటర్లు 46, పెద్ద డయాగ్నస్టిక్ సెంటర్లు 13 ఉన్నాయి. వీటితో పాటు ఫెర్టిలిటీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇక బోధనాస్పత్రికి సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 7 రకాల స్పెషలిస్టు వైద్యం అందుబాటులో ఉంది. ప్రభుత్వ, కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షలాది మంది రోగులు సేవలు పొందుతున్నారు. బళ్లారి, కర్నూలు, కడప, తెలంగాణలాంటి ప్రాంతాల నుంచి కూడా రోగులు వైద్యం కోసం అనంతపురం వస్తున్నారంటే వైద్య సేవలు ఏ స్థాయిలో విస్తరించాయో అర్థం చేసుకోవచ్చు.

అందుబాటులో ఆధునిక సేవలు



అనంతపురం 'సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గుండెకు సంబంధించి యాంజోగ్రామ్, యాంజోప్లాస్టీ, ఇన్‌ట్రా వాస్క్యులర్ ఇమేజింగ్, ఫ్రాక్షనల్ ఫ్లో రిసర్వ్, తదితర అధునాతన శస్త్ర చికిత్సలు చేస్తారు. న్యూరో సర్జరీకు సంబంధించి పిట్యూటరీ ట్యూమర్ సర్జరీ(కోత లేకుండా ముక్కు ద్వారా సర్జరీ), స్పైనల్ డిస్క్ ప్రొల్యాప్స్‌ను మినిమలీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (చిన్న కోత) ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు అన్ని రకాల బ్రెయిన్, స్పైనల్ కార్డ్ ఆపరేషన్లను చేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సూపర్ స్పెషాలిటీలో కార్డియాక్, న్యూరో సర్జరీతో పాటు యూరాలజీ, కార్డియో థొరాసిక్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి.

జీజీహెచ్‌లో పాలియేటివ్ థెరపీ

ఏళ్ల తరబడి దీర్ఘకాలిక నొప్పితో బాధపడుతున్న రోగులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పాలియేటివ్ థెరపీ ద్వారా వైద్యం అందిస్తున్నారు. కేవలం ప్రధాన నగరాల్లో మాత్రమే ఇటువంటి తరహా సేవలుండేవి. అటువంటిది జీజీహెచ్‌లో అనస్తీషియా వైద్యులు పాలియేటివ్ థెరపీను ఇస్తున్నారు. తెలంగాణా, కర్నూలు, కడప ప్రాంతాల రోగులు కూడా ఈ సేవలను పొందుతున్నారు.

వైద్య కళాశాల పట్ల ఆసక్తి

గతంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ సీట్లు ఉండే పరిస్థితి లేదు. ప్రస్తుతం పీజీ సీట్ల సంఖ్య 300కు చేరింది. ఏటా 122 మంది పీజీ విద్యార్థులు చేరుతున్నారు. దీంతో పాటుగా యూజీ సీట్లు 200 ఉన్నాయి. 23 విభాగాల్లో వైద్యులు సేవలందిస్తున్నారు. న్యూరో సర్జరీ ఎంసీహెచ్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఆలిండియా కోటాలోనూ అధిక సంఖ్యలో విద్యార్థులు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలోనే విద్యనభ్యసించాలని చూస్తుండడం విశేషం. రాష్ట్రంలోనే ఉత్తమ కళాశాలల్లో అనంతపురం బోధనాస్పత్రి ఉండడం గమనార్హం.


మొక్కల నాటక ముందు...


మొక్కల నాటిన తర్వాత...





● అదర్ సైడ్


● శ్వేత

ఆమే వనమై...

ఎస్.పి గారి డ్యూటీ నేరాలను అరికట్టడం.
భూమి మీద చెట్టు చేమా
లేకుండా పోయేలా
మనిషి వహిస్తున్న నిర్లక్ష్యాన్ని మించిన
నేరం ఉంటుందా?
దానినీ అరి కట్టాలి కదా.
కామారెడ్డి జిల్లా ఎస్పీగా శ్వేత పనిచేస్తున్న
కాలంలో ఒక హరిత వనాన్ని పెంచడం
తన కర్తవ్యం అనుకున్నారు.
ఆరు ఎకరాల్లో ఎన్నో మొక్కలు నాటించారు.
ఇప్పుడది అడవిని తలపిస్తోంది.
హరిత రక్షక వనంగా నామకరణం చేసుకుంది.

హరితహారం స్ఫూర్తితో తన వంతు బాధ్యతగా మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగారు అప్పటి కామారెడ్డి ఎస్పీ శ్వేత. కామారెడ్డిలో ఆరు ఎకరాల స్థలంలో 80 రకాలైనవి ఎన్నో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడమే కాదు వాటిని కాపాడేందుకు ఆమెతో పాటు పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమించారు. ఫలితంగా ఇప్పుడు అక్కడ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగి పెద్దవయ్యాయి. మూడేళ్ల కాలంలో ప్రతీ రోజూ ఎస్పీ శ్వేత అక్కడికి వెళ్లేవారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించేవారు. ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ అక్కడే చేసేవారు. ఈ వనానికి 'హరిత రక్షక వనం' అని నామకరణం చేశారు.

ఎనభై రకాల మొక్కలు...

స్థానికంగా పెరిగే అటవీ వృక్ష జాతులకు సంబంధించి దాదాపు 80 రకాల మొక్కలు నాటారు శ్వేత. రామ సీతాఫలం, బాదమ్, శ్రీగంధం, టేకు, ఖర్జూరం, వేప, పనస, నేరేడు, చింత, దానిమ్మ, జామ, ఈత, మేడి, మునగ, నిమ్మ, ఉసిరి, వెలగ, కుంకుడు, కదంబం, నల్లజీడి, రాచఉసిరి, జిట్రేగి... మొదలైన రకాలకు సంబంధించి ఎన్నో మొక్కలు నాటారు.

ప్రతీ మొక్కకు నీరందించడానికి డ్రిప్ ఏర్పాటు చేశారు. అక్కడ రెండు బోర్లు తవ్వించి వాటి ద్వారా నీటిని అందిస్తున్నారు. 'హరిత రక్షక వనం'లో రెండు నీటి గుంతలు తవ్వించారు. అందులో నీరు నిల్వ ఉండేలా వర్షపు నీరు ఆ గుంతలో నిండేలా ఏర్పాటు చేశారు. పై భాగాన ఉన్న గుంతలో పది అడుగుల మేర నీటి నిల్వ ఉంది. అందులో చేప పిల్లలను పెంచుతున్నారు. నీటిని నిల్వ చేయడం మూలంగా బోరుబావుల్లో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేకుండాపోయింది.



ఆ శ్రమ వృథా పోలేదు...

'హరిత రక్షక వనం'లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు శ్రమించారు. ఆ మొక్కలను తమ ఇంటి పెరట్లో నాటిన మొక్కలలాగే చూసుకున్నారు. మొక్కల చుట్టు పెరిగే గడ్డిని తొలగించడం, నీరు మొక్కకు చేరుతుందా లేదా చూసుకోవడం, పనికి రాని చెత్తను తొలగించడంలాంటి పనులెన్నో చేసేవారు. పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తే వారితో మొక్కలు నాటించేవారు. ఆ చెట్లకు వారి పేర్లతో నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేశారు.

'చెట్లు అంటే....భూమాత రాసిన కవిత్వం' అనేది భావుకతతో కూడిన మాటే కాదు బాధ్యతను గుర్తుకు తెచ్చే మాట.

వృత్తిబాధ్యత, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పచ్చటి వనాన్ని సృష్టించడం కష్టమేమీ కాదు అని నిరూపిస్తున్నారు శ్వేత లాంటి అధికారులు.

- సేపూరి వేణుగోపాలచారి,
సాక్షి, కామారెడ్డి

మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు

శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారాల్లో బిజీగా ఉంటూనే రకరకాల సామాజిక అంశాలపై స్పందించేవారు శ్వేత. కరోనా కాలంలో పోలీసు సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని కలిగించి ఎంతో మందికి అండగా నిలిచారు. నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్షలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. శారీరక ధారుడ్య పరీక్షలకు శిక్షణ ఇప్పించారు.

అమ్మలాంటి చెట్టు

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన స్థలం దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ స్థలం కనిపించి నాకు వనం పెంచాలన్న ఆలోచన వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినపుడు అక్కడ వాతావరణం మారిపోతుంది. చల్లబడాలంటే సమాంతరంగా చెట్లు పెంచాలి. అందుకే 2017 దసరా రోజు నేను, అప్పటి కలెక్టర్ సత్యనారాయణ గారు ఇక్కడ మొక్కలు నాటాం. కామారెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వాళ్ళతో అక్కడ మొక్కలు నాటించాను. నాటడంతో పాటు మా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ వాటి సంరక్షణకు నిరంతరం శ్రమించారు. అక్కడి ఉసిరి చెట్టు దగ్గర మా అమ్మ ప్రతీ కార్తీక పౌర్ణమి రోజున పూజలు చేసి అందరికీ భోజనాలు పెట్టేవాళ్ళు. నేను బదిలీ అయినా ఒక అమ్మలా ఆ చెట్టు గుర్తుకొస్తూ ఉంటుంది.

- ఎన్. శ్వేత, ఐపీఎస్

● నృత్యోద్యమం



లండన్‌లో శివతాండవం

నాట్యం అనేది ఆహ్లాదానికే కాదు మానసిక వికాసానికి కూడా అనుకుంటే... నాట్యం అంటే సంతోషమే కాదు మానసిక స్థైర్యం కూడా అనుకుంటే... నాట్యం అనేది ఆనందతరంగమే కాదు పర్యావరణహిత చైతన్యం అంటే గుర్తుకు వచ్చే పేరు.... సోహిని రాయ్ చౌదరి....

సోహిని రాయ్ చౌదరి తండ్రి సుబ్రతో రాయ్ సితార్ విద్వాంసుడు. తల్లి ఉమా రాయ్ చౌదరి శిల్పి. కోల్‌కత్తాలోని వారి ఇంటిలో ఎప్పుడూ కళాత్మక వాతావరణం ఉండేది. నాలుగు సంవత్సరాల వయసులోనే నృత్యకారిణిగా కాళ్లకు గజ్జె కట్టింది సోహిని రాయ్ చౌదరి. భరతనాట్యం నుంచి మోహినియాట్టం వరకు ఎన్నో నృత్యాలలో ప్రావీణ్యం సాధించింది.

'మన వైదిక సిద్ధాంతాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవతావాదం, మంచి గురించి చాటి చెప్పాయి. కోవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధంలాంటి అనిశ్చిత కాలాల్లో అవి మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఇతరులకు సహాయపడేలా ప్రేరణ ఇస్తాయి. జీవితానికి సానుకూల దృక్పథాన్ని ఇచ్చే శక్తి మన పవిత్ర తత్వాలలో ఉంది' అంటుంది సోహిని.

వాతావరణ మార్పులపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో సదస్సులలో సోహిని రాయ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వేదమంత్రాలతో కూడిన నా నృత్యప్రదర్శన ప్రకృతి గురించి, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ఉంటుంది. పశుపతిగా శివుడు, అడవులు, జంతువులు, పర్యావరణాన్ని పరిరక్షించేవాడు. ప్రకృతిని మనుషులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, విధ్వంసం సృష్టిస్తున్నారో చెప్పడానికి, ప్రకృతితో సన్నిహిత సంబంధాల కోసం శివతాండవం చేస్తున్నాను' అంటున్న సోహిని రాయ్ 'గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ కూడా అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళలు, సంస్కృతికి సోహిని రాయ్ చౌదరి అంబాసిడర్‌గా మారింది. యూకేలోని ఇండియన్ హైకమిషన్‌కు చెందిన నెహ్రూ సెంటర్‌లో సోహిని చేసిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివతాండవంతో పాటు శివుడి గురించి రుషి దాస్ గుప్తా చెప్పిన విలువైన మాటలను వినిపించింది.

మార్కండేయ పురాణం, శివపురాణాలలో నుంచి ఒక కథను ఎంపిక చేసుకొని దాన్ని నృత్యరూపకంగా మలుచుకుంది. లండన్ తరువాత అమెరికా, రష్యా, జర్మనీ, స్పెయిన్... మొదలైన దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతోంది.

'డ్యాన్సింగ్ విత్ ది గాడ్స్' పేరుతో తొలి పుస్తకం రాసిన సోహిని రాయ్‌కు రచనలు చేయడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆమె రచనల్లో మహిళా సాధికారత నుంచి రంగస్థలం వరకు, నృత్యోద్యమం నుంచి దేవదాసీల దుస్థితి వరకు ఎన్నో అంశాలు ఉంటాయి.


శక్తివాదాన్ని ప్రధానంగా చేసుకొని ఎన్నో రచనలు చేసింది.

'ఇండియన్ స్టేజ్ స్టోరీస్: కనెక్టింగ్ సివిలైజేషన్స్' పేరుతో సోహినిరాయ్ రాసిన పుస్తకం భారతీయ రంగస్థలం ఆత్మను పట్టిస్తుంది. ఈ పుస్తకం ద్వారా మన నాగరికతలోని గొప్ప సాంస్కృతిక, సంప్రదాయల గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది. యూరప్‌లోని పద్దెనిమిది యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసింది.

'సూఫీ తత్వం, రూమీ కవిత్వం, ఠాగూరు మానవతావాదంలో నాకు మహిళాసాధికారత కనిపిస్తుంది' అంటున్న సోహినిరాయ్ చౌదరి తన నృత్య కళను సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగిస్తోంది.


● సోహిని రాయ్ చౌదరి

● ముగ్గు ముచ్చట




నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల
17 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్కలు




సి. పుష్కల,
శ్రీనగర్ కాలనీ, కడప
17 చుక్కలు, 7 వచ్చేవరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● గర్భసంచి

తొలగించడమే పరిష్కారమా?!

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సెన్సెస్, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థ'కు చెందిన శాస్త్రవేత్తలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్ ద్వారా ఓ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని 25 నుంచి 49 ఏళ్ల మధ్య వ్యవసాయ కూలీలుగా ఉన్న గ్రామీణ మహిళల్లో 32 శాతం గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని, ఈ శస్త్ర చికిత్సలు ప్రభుత్వ బీమా పథకాల ద్వారానే జరుగుతున్నాయని వెల్లడి అయింది. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్సలవైపు గ్రామీణ మహిళలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?! ఏ అంశాలు వీరిని ప్రేరేపిస్తున్నాయి?! గర్భసంచి తొలగిస్తే వచ్చే నష్టమేమిటి?! అవగాహన అవసరం...

దేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రాష్ట్రాల్లోని గ్రామాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. అవగాహన లోపమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు స్త్రీ వైద్య నిపుణులు. వారు చెబుతున్న విషయాలేంటంటే..

ఖర్చుకు భయపడి...

● వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళల్లో వ్యక్తిగత శుభ్రత తక్కువ. దీనివల్ల గర్భసంచికి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

● పోషకాహార లోపం వల్ల రక్తహీనత, అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్లు, రుతు సమయంలో వచ్చే నొప్పులను ఇంటిలో పనుల కారణంగా భరిస్తున్నారు. అయితే గర్భసంచి వాపు, సిస్టులు అనగానే క్యాన్సర్ అని భయపడుతున్నారు.

● సమస్య తీవ్రం అయినప్పుడు హాస్పిటల్‌కు రావడం, త్వరగా నయం కాకపోవడంతో పదే పదే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసి వస్తుందని, దీనివల్ల ఇంటి పనులు, కూలి పనులకు ఇబ్బందులు వస్తాయని, తమ వెంట వచ్చేవారి పని కూడా పోతుందని, టెస్టులకు, మందులకు అదనపు ఖర్చు అని.. 'గర్భసంచి తొలగించుకుంటే' ఈ చికాకులన్నీ పోతాయనే ఆలోచనకు వస్తున్నారు.

● శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అందించే ఉచిత పథకాల కోసం వెతుకుతున్నారు.

● గర్భసంచి సమస్యలను వాయిదా వేసుకుంటూ కూలి పనులు ఎక్కువ ఉండని వేసవి కాలాన్ని ఆపరేషన్‌కు కేటాయించుకుంటున్నారు.

● త్వరగా పెళ్ళిళ్ల అవడం, పిల్లలు పుట్టడం, త్వరగా గర్భసంచి తొలగించుకోవడం అనేది గ్రామాల్లో కూలి పనులకు వెళ్లే వారిలో తరచూ కనిపిస్తోంది.

అత్యవసర అవగాహన

● శుభ్రతకు సంబంధించిన అవగాహన అత్యవసరం.

● అధిక రక్తస్రావం సమస్యలకు కూడా పరిష్కారాలు ఉన్నాయి. హార్మోన్లకు, బలానికి వాడే మందులను అందజేయాలి.

● తప్పనిసరై గర్భసంచి తొలగించుకున్నా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రకరకాల ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీంతో మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మధుమేహం, బలహీనత, ఎముకల సమస్యలు... వీటన్నింటి పైనా అవగాహన కల్పించాలి.

ఆర్థికంగానే కాదు ఆరోగ్యంగా ఉండటమూ దేశ భవిష్యత్తుకు కొలమానమే. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలు తరచూ పురుగు మందులకు గురి కావడం వల్ల కూడా అధిక రుతుస్రావాలు, ఫైబ్రాయిడ్లు, గర్భాశయ లోపాలు, జననేంద్రియ సమస్యలకు కూడా గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏడాదికోసారి పాప్‌స్మియర్ టెస్ట్

గర్భసంచి తొలగించడం వల్ల అండాలు విడుదల కాక హార్మోన్ల పని తీరు దెబ్బతింటుంది. దీనివల్ల ఎముకలపై ప్రభావం పడి, త్వరగా కీళ్ల సమస్యలు వస్తాయి. చాలా మందిలో రకరకాల ఇన్ఫెక్షన్ల వల్ల గర్భసంచి వాపు వస్తుంది. ఫైబ్రాయిడ్స్, సిస్టులు వస్తుంటాయి. అయితే అవగాహన లేక క్యాన్సర్ వస్తుందేమో అనే భయంతో గర్భసంచి తీసేయమని కోరుతున్నారు. పాప్‌స్మియర్ స్క్రీనింగ్‌తో గర్భసంచి సమస్య ఏంటో ముందే తెలుసుకోవచ్చు. దానికి తగిన మందులు వాడితే సరిపోతుంది. 40 ఏళ్ల లోపు మహిళలకు గర్భసంచి తొలగించకపోవడమే మంచిది. హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్స్, ఏడాదికోసారి పాప్ స్మియర్ టెస్టులు, కుటుంబం మొత్తానికి స్త్రీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.



- డాక్టర్ భానుప్రియ, గైనకాలజిస్ట్,
గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, నిజామాబాద్



అడ్డంకిగా భావిస్తున్నారు

గ్రామీణ మహిళలు ఓవర్ బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్స్ వంటి సమస్యలతో మా దగ్గరకు వస్తుంటారు. ఇలాంటప్పుడు టెస్టులు చేయించుకోవడం మందులు వాడటం, పదే పదే వైద్యులను సంప్రదించడం వారికి కష్టంగా మారుతుంది. అందుకు గర్భసంచి తొలగించుకోవడం మేలేమో అనే ఆలోచన చేస్తున్నారు. సాధారణంగా 50 ఏళ్లలో మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తాయి. సర్జికల్‌గా వచ్చే మెనోపాజ్ వల్ల చెమటలు పట్టడం, అలసిపోవడం, చిరాకు, హాట్ ఫ్లషెస్.. అన్నీ ముప్పైల్లోనే కనిపిస్తాయి.



- డాక్టర్ మనోరమ,
మధిర, ఖమ్మం జిల్లా

● బ్యూటిప్స్



కురుల చివరలు చిట్లుతుంటే...

చలికాలం చర్మ ఆరోగ్యాన్నే కాదు శిరోజాల సహజత్వాన్ని కాపాడుకోవాలి. లేదంటే వెంట్రుకలు పొడిబారడం, చిట్లడం, చుండ్రు సమస్య తలెత్తడం వంటివి చూస్తుంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా...

అలెవెరాతో కండిషనింగ్

షాంపులు, కాలుష్యం, గాలిలో తేమ తగ్గడం.. వంటి వాటి వల్ల ఈ కాలంలో వెంట్రుకలు త్వరగా పొడిబారడం, చిట్లడం వంటివి సహజంగా జరుగుతుంటాయి. వీటి వల్ల జుట్టు నిస్తేజంగా కనిపిస్తుంది. రసాయనాల గాఢత తక్కువగా ఉండే షాంపూతో తల స్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్‌ను జుట్టుకు పట్టించాలి. 15-20 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా రసం జుట్టుకు కావలసినంత కండిషన్ లభించేలా చేస్తుంది.

ఉసిరితో మృదుత్వం

ఉసిరి, మందారపువ్వులు మరిగించిన కొబ్బరినూనెతో మాడుకు, వెంట్రుకలకు రాసి, మర్దనా చేయాలి. మరునటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఈ విధంగా చేస్తే వెంట్రుకలు చిట్లడం సమస్య తగ్గుతుంది. కురుల మృదుత్వం పెరుగుతుంది.

లీగల్

నిరాశ పడద్దు... మీకు న్యాయం జరుగుతుంది

మా ఇంటి పక్కన వారు మా ఇంటికి ఆనుకొని ఎలాంటి అనుమతి లేకుండా వారి పెంట్‌హౌస్ కట్టుకుంటున్నారు. ఆ పెంట్‌హౌస్ కట్టడం వలన మా ఇంటిలోకి వెలుతురు రావడం ఆగిపోతుంది. వారు పెంట్ హౌస్ కట్టుకోవడానికి అనుమతి కూడా లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇల్లు మా ఇష్టం, నీ కెందుకు సమాధానం చెప్పాలి అని గొడవ పడుతున్నారు. కాలనీ అసోసియేషన్ వారు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు.

- పవన్ కుమార్, హైదరాబాద్

ముందుగా మీరు వ్యక్తిగతమైన వాగ్వాదానికి చోటు ఇవ్వకండి. అది సరైనది కాదు, దాని వల్ల వివాదం పెరుగుతుందే తప్ప తగ్గదు! ఎవరి ఇంటిలో వారు నిర్మాణాలు చేసుకోవచ్చు కానీ అది పక్కవారికి ఇబ్బంది కలగకుండా, పక్కవారి హక్కులకు భంగం కలగకుండా ఉండాలి. అంతేకాక, చట్టరీత్యా నిబంధనలకు లోబడి ఉండాలి. సరైన అనుమతి లేకుండా నిర్మించే ఎలాంటి కట్టడమైనా అక్రమ కట్టడంగానే పరిగణించబడుతుంది. చట్టరీత్యా చర్యలు తీసుకుంటే అలాంటి అక్రమ కట్టడాలను తొలగించాల్సి వస్తుంది. మీరు వెంటనే మునిసిపల్ అధికారులకు ఒక ఫిర్యాదు చేయండి. అందులో మీకు కలిగే నష్టం ఏమిటి, మీ పక్కింటి వారు చేస్తున్న అక్రమ నిర్మాణం ఏమిటి, ఎందుకని ఆ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణం అని మీరు అంటున్నారు వంటి విషయాలను ప్రస్తావిస్తూ రాయండి. నేరుగా వెళ్తే అధికారులు మీ ఫిర్యాదు తీసుకోలేము అనటం సహజంగా చూస్తుంటాం. అందుకే రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ ఫిర్యాదును పంపించవచ్చు. సరైన వ్యవధిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే, మీరు హైకోర్టును కూడా ఆశ్రయించి మీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ఆర్డరు పొందవచ్చు. అలా చేయడం ద్వారా అధికారులు సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిజానిజాలు తేల్చిన తర్వాత తొలగించే చర్యలను చేపడతారు. అయితే, కోర్టు కేసులలో కొంత ఆలస్యం జరగవచ్చు. దానికి నిరాశ పడవలసిన అవసరం లేదు. చట్టరీత్యా మీకు న్యాయం జరుగుతుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.